కథా నిలయం
2027
శ్రీకాకుళం

# శ్రీపాదరేణువు

స్టేషను సందడిగా వుంది. ప్రయాణీకుల వెయిటింగ్ హాల్లో బెంచీలేకాదు, నేలగూడా ఖాళీగా లేదు. టికెట్లిస్తున్న కిటికీ దగ్గర త్రొక్కిసలాడిపోతున్న జనం, ఆ కిటికీ కాస్తా చేతుల్లో వూడివస్తేగానీ యీవలికి వచ్చే టట్టు లేరు.

"ఈ రోజు టిక్కెట్టు దొరకడం గూడా అనుమానమే!" అన్నాడు సుందరం.

"స్టేషనులోకి అడుగుపెట్టామో లేదో. నీలోకి ప్రయాణీకుడి మనస్తత్వం వచ్చేసింది" అన్నాను.

"ప్రయాణీకుడి కంటూ ఒక మనస్తత్వమా?" ఆశ్చర్యంగా నావైపు చూశాడు సుందరం.

"టికెట్టు దొరికేదాకా దొరకదేమో నన్న అనుమానం. అది దొరికిన తర్వాత రైలు సకాలంలో రాదేమోనన్న సందేహం. రైలు గూడా వచ్చిందిపో, కూచోడానికి తావుంటుందో. వుండదోనన్న ఆందోళన. తావుగూడా దొరికిందనుకో ఇతరు లెవరూ పెట్టెలోకి ఎక్కగూడదన్న స్వార్థం; మళ్ళీ యింతులోనూ ఒక తమాషా; నువ్వు ధర్మావరం దాకా వెళ్లాలనుకో. రైలంత వరకూ సురక్షితంగా వెళ్తేచాలు ననుకుంటావు. ఆ తరువాత అది వెళ్ళినా. వెళ్ళకపోయినా. మరేమైపోయినా నీకు దిగులుండదు...."

"సంతోషించాంలేవయ్యా సీతాపతీ! ప్రయాణీకుడి మన స్తత్వం తెలిసినంత మాత్రాన ప్రయాణం సుకరంగా గడిచిపోతుందనుకోవద్దు వీలయినంతలో యిబ్బందుల్ని తగ్గించుకోడానికి ప్రయత్నించాలి" అన్నాడు సుందరం.

ఎలా ప్రయత్నించాలో సెలవివ్వ మన్నాను.

'ఇదిగో యిలాగేనంటూ ఒక యాభై రూపాయల నోటును జేబులో నుంచి పైకి తీశాడు సుందరం.

"ఎందుకోయ్ సుందరం! ఆ డబ్బుతో నువ్వు రైలును కొనలేవు" అన్నాను.

"రైలుబండిని కొనలేక పోవచ్చునుగానీ ఫస్టుక్లాసు టికెట్టును కొనగలను" ధీమాగా అన్నాడు సుందరం.

"ఎందుకు బాబూ! వద్దు. ఎంచినట్టుగా ముప్పైమైళ్లు ఓ గంటసేపు ప్రయాణం ఈ మాత్రానికి ఫస్టుక్లాసెందుకూ? నామట్టుకు నాకు ఫస్టుక్లాసులో ప్రయాణం చేసే అవకాశ మెప్పుడూ కలగలేదు. గాంధి మహాత్ముడు విధిగా మూడోతరగతి పెట్టెలో ప్రయాణం చేసేవాడట. నేనాయనకన్న గొప్పవాణ్ణికాను...." అన్నాను.

"నీ బోడి ఆదర్శాలు నాదగ్గర వల్లించకు సీతాపతీ!" విసుక్కున్నాడు సుందరం. "నీకెందుకూ! నువ్వూరుకో టిక్కెట్లు కొనేవాణ్ణి నేను. నాకులేని బాధ నీకేమొచ్చింది?"

నిజానికి నాకు బాధగానేవుంది. రోడ్డుపైన నడుస్తూ నేను వీధి కిరువైపులా ఇంద్రభవనంలాంటి కట్టడాల నెన్నో చూచాను. అవి నావన్న అభిప్రాయం కలలోనైనా కలగలేదు. సరిగ్గా అలాగే ఫస్టుక్లాసు రైలుపెట్టెను గూడా ఎప్పుడైనా

వెలుపలి నుంచీ చూడానేమోగాని. లోపలికివెళ్ళి దాన్ని నేనెన్నడూ పావనం చేయలేదు. దినం మంచిదని పగలే దొంగతనానికి పూనుకున్నట్టుగా అవకాశం దొరికింది గదా అని. ఈ రోజున నేను ఫస్టు క్లాసు పెట్టెలోకి జొరబడి ఇతరుల జాగాను దురాక్రమణ చేయడం ఏం బాగుంటుంది? రెండో తరగతి ప్రయాణీకుల మధ్య కూచుంటే. నేను నావాళ్ళలోనే వున్నట్టు నాకెంతో హాయిగా వుంటుంది. పట్టాలు పుచ్చుకొని పెద్ద ఉద్యోగం చేస్తున్న కొడుకుదగ్గరికి వెళ్ళి అతడు తమ దగ్గర గూడా ఆఫీసరు హోదా వెలగబెట్టేసరికి, ఆశోపహతులై తిరిగివచ్చే తల్లిదండ్రులు. పిండి వంటలతో నింపి మూతికి పసుపుగుడ్డ బిగించిన కొత్త బిందెను ప్రక్కనుంచుకొని తీయటి కోరికల్తో కాపురానికి వెళ్ళే కొత్త కోడళ్ళు. పంచాయతీ బోర్డు మెంబరుకు రాష్ట్ర రాజకీయాలను వివరించే బడిపంతుళ్ళు, కొంగులో కట్టుకున్న డబ్బుమూటను విప్పి ఏడుస్తున్న బిడ్డకు బటాణీలు కొనిపెట్టె తల్లులు పుస్తకాల సంచులతో జట్లు జట్లుగా హైస్కూళ్ళలో, కాలేజిలలో వెళ్ళే విద్యార్థులు. వీళ్ళందరూ ఎన్నో జన్మల నుంచీ పరిచితులై వున్న ఆత్మబంధువుల్లా కనిపిస్తారు. వీళ్ళ సుఖదుఃఖాలు కోప తాపాలు, రాగద్వేషాలు నాకు అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినంత సులభంగా అవగత మౌతాయి నా వేషం నా భాష నా స్తోమత నా సంస్కారం నిస్సంకోచంగా నిర్మోగమాటంగా నన్ను రెండో తరగతి పెట్టిలో కూచోడానికే అనుమతిస్తాయి. పోగా యిందు కయ్యే ఖర్చును మిత్రుడొకడు భరిస్తున్నాడు గనుక ఈరోజు నేను ఫస్టుక్లాసు పెట్టెలో ప్రయాణం చేస్తే చేయవచ్చు. కానీ ఎల్లకాలం నాకీ అవకాశం లభించగలదని గానీ, ఎప్పటికి నేనీ స్టేటస్ మెయింటెయిన్ చేయగలనని గానీ పూచీ ఏమీలేదు. ఎందుకొచ్చిన భోగం? ఈ ఒకరోజు భోగం నాకొద్దే వద్దు....?"

సుందరానికైనా ఈ ఫస్టుక్లాసు మోజు ఈ మధ్యనే అలవడినట్టుంది. వాడూ. నేనూ బాల్య స్నేహితులం. పుట్‌బోర్డుపైన నిలబడి కమ్మీ పట్టుకొని వేలాడుతూ ఎన్నో దఫాలు రైలు ప్రయాణం చేసినవాళ్ళం మరైతే యిటీవల ఒక తమాషా జరిగిన మాట కాదనలేను. హటాత్తుగా సుందరం ఒపినంత డబ్బు కళ్ళజూచాడు. లాటరీలో కాదులెండి! పిల్లనిచ్చిన మామగారు పాపం అల్లుడుగదా అని కొంత పెద్ద మొత్తమే ముట్టజెప్పారు. మంచిదే! అందువల్ల తనకు డబ్బు దుబారాచేసే హక్కు లభించిందని సుందరం భావిస్తున్నట్టయితే నాకేమీ అభ్యంతరంలేదు నన్ను తన అడుగుజాడల్లో నడవమని నిర్బంధించకుండా వారీ ముప్పయి మైళ్ళు విమానంలో వెళ్ళినా నా కిష్టమే.

"చూడు సుందరం! నువ్వు మరేమీ అనుకోవద్దు. అంత పట్టింపుగా వుంటే నువ్వు ఫస్టు క్లాసు టిక్కెట్టు కొను. నేను మాత్రం నా మామూలు మేరకు సెకెండు క్లాసులోనే ప్రయాణం చేస్తాను. ఏ తరగతి పెట్టెలో ప్రయాణం చేసినా దిగే దొకస్టేషన్లోనేగదా!" అంటూ నచ్చచెప్పడానికి ప్రయత్నించాను.

సుందరం నావైపు చురచుర చూచాడు. నాది చాలా చచ్చు ఉపాయమన్నాడు. జాస్తి మాట్లాడితే ఫస్టుక్లాసు టిక్కెట్టే కొనేద్దును. ఈ బండిలో ఫస్టుక్లాసు టికెట్టు లేదు గనుక బ్రదికిపోయావు పొమ్మన్నాడు.

నేనసలే మెతకవాణ్ణి. తెగేదాకా ఒక విషయాన్ని సాగదియ్యడం నాకిష్టే యిష్టం వుండదు. అందువల్ల కిక్కురుమనకుండా వూరకుండిపోయాను.

నన్ను ప్లాట్‌ఫారంపై నిలబెట్టి తాను నేరుగా బుకింగ్ ఆఫీసులోకి దూరి టికెట్లు పట్టుకొచ్చేశాడు సుందరం.

తనకు తానే బహుపరాక్ చెప్పుకున్నట్టుగా ఎక్కడో వస్తున్నరైలు కూత బెట్టింది.

ప్రయాణీకులు పెట్టెలు. సంచులు చేతిలోకి తీసుకుని తోడివారిని విడవకుండా వెన్నంటి వుండమని హెచ్చరికలు చెప్పుకుంటూ ఎవరి జాగ్రత్తలో వారున్నారు. సుందరంలో అలాంటి తొట్రుబాటేమీ కన్పించడం లేదు.

రైలు బుసలుపెట్టుకుంటూ స్టేషనులోకి వచ్చేసింది.

బాగా కష్టపడి పరీక్షలకు ప్రిపేరయిన తర్వాత చివరి క్షణంలో పరీక్షలులేవు. అందరూ పాసైపోయేనని ప్రకటిస్తే ఎలాగుంటుంది. వచ్చిన రైలలాగే వచ్చింది. ఏవో నాలుగైదు తప్పితే మిగిలిన పెట్టెలన్నీ యించుమించు ఖాళీగానే వున్నాయి.

కానీ ఎంత ఖాళీగా వున్నప్పటికీ ఈ సందర్భంలో మేము మూడో తరగతి పెట్టె వైపు తిరిగి చూడరాదన్న కఠోర నియమాన్ని నేను మరచి పోలేదు.

సుందరం పాదాలు అతనితో బాటుగా నన్ను గూడా సెకండ్‌క్లాసు కంపార్టు మెంటు దగ్గరికే తీసుకెళ్ళాయి. 'ఎక్కవోయ్ సీతాపతీ, ఎక్కు' అంటూ సుందరం లోపలికి జారుకున్నాడు. నేను నీడలా అతణ్ణి వెంబడించాను.

ఆ రోజు సెకండ్ క్లాసు పెట్టెలో ఒక్క బెంచీ అయినా ఖాళీగా లేదు.

ఎవరైనా దిగితే ఖాళీ ఏర్పడి తావు దొరకవచ్చునని నే నొప్పుకుంటాను. కానీ దిగేటట్టయితే రైలు కదిలేలోగా దిగిపోవాలి గదా. అదేం జరగలేదు.

సుందరం తన చేతనున్న లెదర్ బ్యాగు తెరచి ఓ టవలు పైకి తీశాడు. రెండు బెంచీల నడుమనున్న ఖాళీ జాగాలో పరిచేశాడు. కూచో సీతాపతీ. కూచో అంటూ తాను ముందుగా కూచుని. రెసిస్టుచేసి నిలద్రొక్కుకోవడానికి వీల్లేకుండా నన్ను గూడా దానిపైన కూలబడిపోయేటట్టుగా చేశాడు.

చుట్టూరా కలయ పరికించడానికే నాకు అలకువగా వుంది. ప్రత్యేకించి వెనకవైపు బెంచీలో ఎవరో ఆడవాళ్ళు కూర్చుని వున్నారు. జరీ అంచు వచ్చిన సిల్కు చీరలు! తళుకు తళుక్కు మనే రాళ్ళ నెక్లెసులు. వంకీ ఉంగరాలు- ఎవరో గొప్పింటి జనానా అని చూడగానే తెలుసుకోవచ్చు.

ఆపాటికి సెకండ్‌క్లాసు పెట్టెనంతా సర్వేచేసి ముగించినట్టున్నాడు సుందరం. దొంగలా మెడ నావైపుకు పాచి. మెల్లగా నా చెవిలో అన్నాడు- 'వెనక బెంచీపైన కూచున్నదెవరో ఎరుగుదువా సీతాపతీ?'

తెలియదన్నట్టుగా పెదవి విరిచాను.

'నీయిల్లు బంగారంగానూ! ఆవిడే తెలియదా నీకు? డిప్యూటీ కలెక్టరు వేణుమాధవనాయుడుగారి భార్యరా బాబూ!'

'ఊఁహూ. అలాగా' అనుకున్నాను. నాకిప్పుడెంతో ఆనందంగా వుంది. పరమానందంగా వుంది. ఎందుకో చెప్పుకోగలరా? సెకండ్‌క్లాసు పెట్టెలో కూచో గలిగినందుకని మీరనుకుంటారు. అబ్బే. కానేకాదు. రెట్టింపు డబ్బు మనది కాదనుకుంటే యిలాంటి పెట్టెలో ఎప్పుడైనా కూచోవచ్చు. డిప్యూటీ కలెక్టరు వేణుమాధవనాయుడుగారి అర్ధాంగి పాద సన్నిధిలో కూర్చునే అవకాశం అందరికీ అన్ని సమయాలలోనూ దొరికేదేనా? అది మాకు మాత్రమే దొరికిన అరుదైన అవకాశం!